కౌంటింగ్ దృష్ట్యా ఐతానగర్లో రౌడీషీటర్లు పరార్

విశాలాంధ్ర-తెనాలి : ఇటీవల జరిగిన ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గాని, అరాచకాలు గాని జరగకుండా తెనాలి డీఎస్పీ రమేష్ పటిష్ట చర్యలు చేపట్టారు. శనివారం స్థానిక ఐతానగర్లో తెనాలి 2టౌన్ సీఐ సుధాకర్ నేతృత్వంలో ఇతర అధికారు లతో కలిసి కార్డెన్ తనిఖీల్లో భాగంగా ఇంటింటికి తిరిగి వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రముఖ రౌడీషీటర్లు పట్టణం నుండి పరారైనట్లు తెలిపారు. పట్టణంలో శాంతి భద్రతలే తమ లక్ష్యమని కౌంటింగ్ దృష్ట్యా ప్రజలు ఎటువంటి ఆవేశాలకు, రెచ్చగొట్టెమాటలు, సంబరాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సరైన పత్రాలు లేని 25 వాహనాలను సీజ్ చేసి 2టౌన్‌కు తరించారని చెప్పారు. ఈ కార్డెన్ తనిఖీలో పట్టణ సీఐలు దశరధరామయ్య, రమేష్, తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, తెనాలి, కొల్లిపర నుండి వచ్చిన సుమారు 50 మంది పోలీసులతో అన్ని వైపుల నుండి సమన్వయంతో తనిఖీలు నిర్వహించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

– మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్

విశాలాంధ్ర-తుళ్లూరు : రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా వెలుగొందాలని, ఎన్నికలలో ధర్మమే గెలుస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ అన్నారు. శనివారం రాజధాని ప్రాంతం వెంకటపాలెంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానంలో భక్తులకు అన్నదానం, ఇతర మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. ఎన్నికల ఫలితాల గురించి మాట్లాడుతూ ధర్మం గెలుస్తుందని, అధర్మం ఓడిపోతుం దన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అండగా ఉంటాం : నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-తెనాలి : స్థానిక గాంధీనగర్, లెనిన్‌రోడ్డులో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు మహమ్మద్ హుస్సేన్ బేగ్ (22), మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ (19) ద్విచక్ర వాహ నంపై వెళుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి తల్లిదండ్రు లైన ఆషాబేగం-ఖలీల్‌బేగ్, సోదరులు ఖాజా, సలీం తదితరులను కూటమి నియోజకవర్గ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ శనివారం మధ్యాహ్నం వారి స్వగృహంలో పరామర్శించారు. మేము అండగా ఉంటాం అధైర్య పడ వద్దు అని నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నాదెండ్ల మనోహర్ రూ.20వేలు నగదు ఆర్థిక సహాయం అందించారు.

కూటమి గెలుపును ఎవ్వరూ ఆపలేరు

విశాలాంధ్ర-గుంటూరు : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపును ఎవ్వరూ ఆపలేరని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక అరండల్‌పేటలో ఉన్న టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాబోతున్నట్టు వైసీపీ చేసుకుంటున్న ప్రచారాలన్నీ అవాస్తవాలేనని అన్నారు. కూటమి గెలవండ ఖాయం..చంద్రబాబు ముఖ్యమంత్రి పక్కా అని అన్నారు. జూన్ 4వ తేదీన టీడీపీ కూటమి గెలుపు సంబరాలు చేసుకోనున్నదని, వైసీపీ ఓటమి పాలవుతుందని తెలిసే పోలింగ్ తర్వాత వైసీపీ నాయకులు అల్లర్లకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గోళ్ళ ప్రభాకర్, నాయుడు ఓంకార్, బొబ్బిలి రామారావు, మేళం సైదయ్య, గుడిమెట్ల దయారత్నం, మన్నవ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తెనాలిలో హనుమజ్జయంతి

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణ పరిసర ప్రాంతాలలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయాలలో స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చనలు, సహస్రనామాలతో ఆకు పూజ, 108 సార్లు భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. బోస్ రోడ్డులోని చిట్టి ఆంజనే యస్వామి వారి ఆలయంలో శ్రీశైల భక్త సేవ సమితి ఆధ్వర్యంలో చిట్టిఆంజనేయ స్వామి దేవస్థానం 100ఏళ్ళు, హనుమజ్జయంతిని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు కార్యవర్గ సభ్యులు లడ్డు ప్రసాద వితరణ జరిగింది. తెనాలి పరిసరగ్రామం అనంతవరం గ్రామంలో శ్రీ వీరాంజ నేయ స్వామి దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజలలో తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. తెనాలి మండల గ్రామాలు పెదరావూరు, నందివెలుగు, కొలకలూరు, ఖాజీపేట, అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాలలో కూడా భక్తులు విశేషంగా హనుమజ్జయంతి కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన తెలంగాణ రాష్ట్రం, కెవి రంగారెడ్డి జిల్లా, గచ్చిబౌలి, ప్రస్తుతం: గుంటూరు సిటి, ఎన్‌జిఓస్ కాలనీ 4వ లైను కాపురస్తులు ఆక్కిరెడ్డి వీరారెడ్డి గారి కుమార్తె మరియు పుష్పిపల్లి మురళీకృష్ణ గారి భార్య ఆక్కిరెడ్డి సుస్మిత అలియాస్ సుస్మితారెడ్డి (సెల్: 9440123150) గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది-

నా క్లయింటు పేరిట గుంటూరు సిటి, ఏటి అగ్రహారం ఎక్స్‌టెన్షన్ ఏరియా బాపతు నల్లపాడు డి.నెం.78రు నందలి 300 చదరపు గజముల స్థలము కలదు. సదరాస్తి ఆమె పేరిటకు ది. 03-12-2012న కొమ్మి నాగమల్లేశ్వరరావు గారి నుండి విక్రయ దస్తావేజు నెం.11520/2012 రుగా నల్లపాడు సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయంలో రిజిష్టరు కాబడినది. సదరు దస్తావేజునకు మొదటి లింకు దస్తావేజు నెం. 1744/2012, రెండవ లింకు దస్తావేజు నెం. 637/2008, మూడవ లింకు దస్తావేజు నెం.287/2003, నాల్గవ లింకు దస్తావేజు నెం.83/1998 అయియున్నవి.

కాగా, మొత్తం దస్తావేజులను ఒక కవరులో పెట్టుకుని ది.14-05-2024న గుంటూరు సిటి, ఎన్‌జిఓస్ కాలనీలోని నా క్లయింటు తన తండ్రిగారి ఇంటికి వచ్చారు. అదేరోజు నల్లపాడు సబ్ రిజిష్ట్రారు ఆఫీసుకి వెళ్లి, అక్కడ సదరు దస్తావేజులు జిరాక్సు అవసరమై నల్లపాడు సెంటర్‌లో జిరాక్సు తీయించుకుని తిరిగి వస్తుండగా పైన పేర్కొన్న అయిదు దస్తావేజులలో డ.నెం.287/2003 మరియు డ.నెం.83/1998 ఒరిజినల్స్ ఎక్కడో పోయినవి. సదరు రెండు లింకు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ తెలియజేసిన యెడల తగిన పారితోషికము ఇవ్వబడును. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 15 రోజులలోగా తెలియజేయగలరు.

టి.యస్.యన్. విద్యాసాగర్, అడ్వకేట్,
డోరు నెం.22-13-124, లాలాపేట,
గుంటూరు, సెల్ నెం.77949 93339

'మానసిక ఉల్లాసం కలిగే కథలు'

విశాలాంధ్ర-గుంటూరు : మే 15వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ నిర్వహించనున్న 'వేసవి విజ్ఞాన శిబిరం'లో భాగంగా శనివారం గుంటూరు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయం నందు 'వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగే కొన్ని మంచిమంచి కథలు తెలియజేశారు. తదుపరి ఖోఖో ఆటను ఆడించి పిల్లలను ఉత్తేజపరిచారు. ఈ శిబిరంలో 9 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా ఏర్పాట్లు సిద్ధం చేయటం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డైక్‌మెన్ ఆడిటోరియం బాలమోహన్ దాస్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటరులో వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీతో కలసి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన్ 4వ తేది ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 30 మంది అభ్యర్ధులు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 132 మంది అభ్యర్ధులు పోటీలో ఉన్నారని, ఓట్ల లెక్కింపు ఏఎన్‌యూలోని ఐదు విభాగాలలో జరుగుతుందన్నారు. ఏఎన్‌యూలోని ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కాలేజీ విభాగంలో తాడికొండ, సివిల్ అండ్ మెకానికల్ విభాగంలో మంగళగిరి, తెనాలి, ప్రత్తిపాడు, ధర్మల్ సైన్స్ ల్యాబ్ బ్లాక్‌లో పొన్నూరు, ఈసిఇ, ఈఈఈ బ్లాక్‌లో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్, పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుందని, పోలింగ్ ముగిసిన అనంతరం మే 13వ తేది నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలలో జాగ్రత్తగా నిల్వ చేసి మూడెంచల పటిష్ట భద్రత కల్పించటం జరిగిందన్నారు. జూన్ 4వ తేదిన రిటర్నింగ్ అధికారులు అసెంబ్లీ నియోజక వర్గాలకు కేటాయించిన కౌంటింగ్ సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ చేసి టేబుళ్ళు కేటాయి ంచటం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు నేపథ్యంలో 2500 మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రీ కౌంటింగ్ ఏర్పాట్లలో భాగంగా శనివారం మధ్యాహ్నం నుంచే సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు, మొబైల్ పార్టీలు, క్యూఆర్టీ టీంలు కొనసాగుతాయన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎన్నికలసంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఇప్ప టికే మూడంచెల భద్రత ఉందని, కౌంటిగ్ రోజు నాలుగో అంచె భద్రత ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి పాస్ ఉన్నవారిని మాత్రమే అనుమతించటం జరుగుతుందన్నారు.ఎన్నికల రోజు వాదనలకు దిగిన వారిపైనా ప్రత్యేక నిఘా ఉంటుందని, వారిని అవసరమైతే ముందస్తుగా అదుపులోకి తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్‌రోజు కౌంటింగ్ ప్రశాంత వాతవరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు.

ఫలితాలుపై ఉత్కంఠ

విశాలాంధ్ర-తాడికొండ : రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. ఇక ఫలితాలు విడుదలే తరువాయి. ఎన్నికల ఫలితాలకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో రాజకీయ పార్టీల నాయకులలో ఫలితాలపై ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. పదిమంది చేరిన చోట ఎన్నికల ఫలితాలపై చర్చ జరుగుతుంది. ఎగ్జిట్ పోల్స్ సైతం తమకు అనుకూలంగా ఉంటాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ప్రధానంగా టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ఇండిపెండెంట్‌ల ప్రభావం ఏ మేరకు ఉంది. వారి ప్రభావం తమకు లాభాన్ని, నష్టాన్ని చేకూరుస్తాయా అనే భావనలో అభ్యర్థులు ఉన్నారు. నియోజకవర్గంలో 1,81,60 మూడు ఓట్లుపోలయ్యాయి. మండలాల వారీగా లెక్కలు తీస్తున్నారు. ఫలానా మండలంలో తమకు ఎక్కువ ఓట్లు వస్తాయని, పలాన గ్రామంలో తమకు అధిక సంఖ్యలో ఓట్లు పెరుగుతాయి అనే అంచనాలతో అభ్యర్థులు ఉన్నారు. ఇప్పటికే జోరుగా బెట్టింగులు జరిగాయి. నగదు, భూములు, ప్లాట్లు, బంగారంతో పాటు, ఆస్తులు సైతం బెట్టింగ్‌ల్లో పెట్టారు. ఇవన్నీ గుట్ట తప్పుడు కాకుండా జరుగుతున్నాయి. ఫలితాలకు సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులలో నరాలు తెగే ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. ఫలితాల ప్రభావం ఎలా ఉందో వేచి చూద్దాం.

గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత ఆన్‌లైన్ తరగతులు

విశాలాంధ్ర-తాడేపల్లి : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ బీఏ(ఐ.ఏ.ఎస్) విభాగం ఆధ్వర్యంలో ఇటీవల గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు ఆన్‌లైనులో ఉచితంగా రెండు నెలల పాటు శిక్షణా కార్యక్రమం జరిగిన విషయం అందరికీ తెలిసిందేనని వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధి అన్నారు. శనివారం ఆయన గ్రూప్-2 మెయిన్సుకు కూడా ఉచితంగా ఆన్లైను లో శిక్షణా తరగతులకు సంభందించిన పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ కెఎల్ యులో విద్యాభ్యాసం పూర్తి చేసిన వారితో పాటు ఆయా కళాశాలల్లో డిగ్రీ పూర్తి చేసి గ్రూప్-2కు సిద్ధపడుతున్న వారందరికీ తమ యూనివర్శిటీలో ఆన్‌లైన్ పద్ధతిలో ఉచితంగా శిక్షనా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ వలన లబ్ధిపొందిన విద్యార్థుల అభ్యర్థన మేరకు మళ్లీ గ్రూప్-2 మెయిన్సుకు కూడా ఉచితంగా ఆన్లైనులో శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని కెఎల్ మేనేజిమెంటు నిర్ణయించినట్లు ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తెలియజేశారు. జూన్ 1 నుండి జులై 20 వరకు ఈ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కుర్రా రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, విభాగాధిపతి డాక్టర్ శివనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్శిటీలో హనుమాన్ జయంతి

విశాలాంధ్ర-గుంటూరు : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ హనుమాన్ జీవిత చరిత్ర నుంచి కమ్యూనికేషన్ స్కిల్స్, ఎదుటి వారిని మెప్పించే నైపుణ్యం, విధేయత, నమ్మకం, విశ్వసనీయతతో ఎలా ఉండాలో నేర్చుకోవచ్చున్నారు. విద్యార్థులందరూ హనుమంతుని లాగా అన్ని తెలిసినా ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస, ధర్మరక్షణ కోసం శ్రమించే వీరత్వం, ఆపద సమయంలో ప్రదర్శించే ఆత్మ విశ్వాసం లాంటివి అలవర్చుకోవాలన్నారు. హనుమంతుడు ఎంత బలవంతుడైనప్పటికీ అతి సాధారణంగా జీవించడం ఎలాగో నేర్పిన ఘనుడు హనుమంతుడు అని అన్నారు. సముద్రాన్ని దాటినా, లంకను సగం కాల్చినా, సీతమ్మను తీసుకువచ్చే బలం ఉన్నా, ఎప్పుడు పొంగిపోలేదని, వేలాది సైన్యంలో తాను ఒక సైనికుడిగా మాత్రమే భావించాడని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఆధునిక భావితరానికి చక్కని మార్గదర్శి హనుమంతుని జీవితాన్ని అధ్యయనం చేసిన వారికే ఆయన గొప్పతనం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కెఎల్‌యూలో ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్

విశాలాంధ్ర-తాడేపల్లి : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ భారతదేశంలో నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్ అని అన్నారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ అనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం క్రింద నూతనంగా ఆవిష్కరణలు చేపట్టిన వారికి నిధులు ఇచ్చేందుకు దేశ వ్యాప్తంగా ఆవిష్కరణలు చేపట్టిన వారిని ధరఖాస్తులు చేసుకోమని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కెఎల్‌యులో ఉన్న ఏసీఐసీ వారు ప్రకటన జారీ చేశారని వీసీ పార్ధసారధి వర్మ తెలిపారు. దీంతో దేశ వ్యాప్తంగా ఎనిమిది వందల ధరఖాస్తులు వచ్చాయన్నారు. వారిలో కంపెనీ రిజిస్ట్రేషన్, కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న ఆయా స్టార్టప్‌లకు నిధులు మంజూరు చేయవచ్చునని, ఇంక్యుబేటర్ సీడ్ మేనేజ్‌మెంట్ కమిటీ సూచనల మేరకు కెఎల్‌యులో ఉన్న ఏసీఐసీ కమిటీ వారు అర్హత సాధించిన విజేతలకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న కాలంలో మరిన్ని నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి వారికి కూడా నిధులను మంజూరు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోఫెసర్, వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్ రామ్, డాక్టర్ కుర్రా రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ సిఐఐఇ డైరెక్టర్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలోని శ్రీ సిద్ధి వినాయక అభయ ఆంజనేయ దేవస్థానం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా హనుమంతునికి పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాదం దాతలు కాట్రగడ్డ మధుసూదనరావు, కోమలి, కామినేని సాంబశివరావు, యర్రంశెట్టి గణేష్, ఖాజాబాయ్, శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

విశాలాంధ్ర-తాడికొండ : మరికొద్ది రోజులలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే అరకొర వర్షాలు పడ్డాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు తమ పంట పొలాలను బాగు చేసుకుంటున్నారు. పొలాలలో ఉన్న తుంగ, గరికనట్లు, పిచ్చికంప చెట్లను తొలగిస్తున్నారు. పొలాల గట్లను పటిష్టంగా చేసుకుంటున్నారు. పొలాల్లో ఉన్న కొద్దిపాటి గుంతలను పూడ్చి వేస్తున్నారు. వృధాగా ఉన్న వంట సరుకులు తగలబెడుతున్నారు. ఇప్పటికే సగానికి పైగా దుక్కులను దున్నారు. మండలంలోని 15 గ్రామాలలో 24 వేల ఎకరాలలో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు.

'మీ మా కిచెన్స్' నూతన రెస్టారెంట్‌ను ప్రారంభించిన గల్లా మాధవి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని లక్ష్మీపురం 3వ లైనులో 'మీ మా కిచెన్స్' అనే నూతన రెస్టారెంట్‌ను టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి శనివారం ఘనంగా ప్రారంభించారు.

అనారోగ్య సమస్యలకు అధిక రక్తపోటు కారణం

- ▲ మందులతో పాటు సరైన డైట్‌తో రక్తపోటును కంట్రోల్ చేయవచ్చు
- ▲ ఇది గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది
- ▲ జీవన శైలిలో మార్పులు చేసుకోవాలంటున్న నిపుణులు



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రస్తుత కాలంలో దీర్ఘకాలిక సమస్యలు ఎక్కువైపోయాయి. వాటిల్లో బీపీ ఒకటి. బీపీ ఒకసారి వచ్చిందంటే జీవితంలో మళ్ళీ తగ్గనే తగ్గదు. కేవలం పెరగకుండా మాత్రమే మనం కంట్రోల్ చేసుకుంటూ ఉండాలి. బీపీ అనేది చాపకింద నీరులా మెల్లగా ప్రవహిస్తుందని నిపుణులు సైతం చెబుతున్నారు. 120/80 ఉంటే రక్తపోటు నార్మల్ అని, అదేవిధంగా 140/90 రక్తపోటు ఉంటే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించి ట్రీట్‌మెంట్ తీసుకోవడం ఎంతైనా మంచిది.

అసలు బీపీ పెరుగుతున్న విషయం కూడా తెలియదు. బీపీ వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. ఈ బీపీ వల్ల చాలా మంది హార్ట్ ఎటాక్‌కి గురై చనిపోతున్నారు. ఈ నేపథ్యంలో అసలు హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు)వల్ల జరిగే అనర్థాలు గురించి గుంటూరు విశాలాంధ్ర మెడికల్ రిపోర్టర్ కె.సుజిబాబు డాక్టర్ కొత్త రాజశేఖర్ రెడ్డి హాస్పిటల్ కన్సల్టెంట్ అండ్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కటారు కార్తీక్‌ను అడిగి తెలుసుకుని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మీ ముందుకు తీసుకొచ్చే ఓ చిన్న ప్రయత్నం

1. అసలు బీపీని ఏ విధంగా చెక్ చేసుకోవాలి : బీపీ చెక్ చేసుకునే ముందు టాయిలెట్‌కి వెళ్ళాలి. ఆ తర్వాత ఒక గ్లాస్ వాటర్ తీసుకొని రెండు కాళ్లు సమాంతరంగా నేలకు ఆనించి ఉంచాల్సి ఉంటుంది. ఆ తర్వాత 4 నిమిషాలు మాట్లాడకుండా ఉండాలి. ఆ తరువాత బీపీ చెక్ చేసుకోవాలి. ఈ విధంగా కాకుండా బీపీ చెక్ చేసుకుంటే అనవసరమైన ఫలితాలు వచ్చి మనలను ఆందోళనకు గురిచేస్తుంది. ఈ నేపథ్యంలో బీపీ చెక్ చేసుకునే ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2. లక్షణాలు : కళ్ళు తిరుగుతూ ఉన్నట్టు అనిపించడం, వాంతుల సెన్సేషన్ అనిపించడం, కళ్ళు మంటలుగా ఉండటం, తల, మెడ భాగం పట్టేసినట్టుగా ఉండటం వంటి లక్షణాలు కనబడతాయి.

3. దేనివల్ల రక్తపోటు వస్తుంది : స్ట్రెస్ వల్ల మనం మన రోజువారీ ఆహారంలో అధికంగా ఉప్పును తీసుకోవడం వల్ల..అలాగే డయాబెటిక్ సమస్య ఉన్నా కూడా అధిక రక్తపోటు వస్తుంది. గుండె, కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి..అలాగే ధూమపానం, ఆల్కాహాల్ వల్ల కూడా అధిక రక్తపోటు వస్తుంది. కొవిడ్ బారినపడి వ్యాక్సిన్ తీసుకున్న వారిలో కూడా అధిక రక్తపోటు కనబడుతు ంది. చెవి, తలనొప్పి, కీళ్లవాతం వంటి సమస్యల వల్ల అధిక రక్తపోటు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సెల్‌ఫోన్‌కు ఎక్కువ సేపు ఎడిట్ అవటం వల్ల.. ముఖ్యంగా ఆడవాళ్ళలో బ్లడ్ శాతం తక్కువగా ఉండటం వల్ల..తగినంత వాటర్ తీసుకోనందు వల్ల.. మల్టీ విటమిన్స్ లోపం వల్ల కూడా మహిళల్లో లో-బీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి.

4. రక్తపోటు రాకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి : రోజులో కనీసం గంటన్నర సేపైనా వాకింగ్ చేయాలి. అదేవిధంగా వ్యాయామాలు కూడా చేయాలి. ఆయిల్ ఫుడ్స్... జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. మనం తీసుకునే రోజువారీ ఆహారంలో ఉప్పును లిమిట్‌గా తీసుకోవాలి. డయాబెటిక్, ఇతరత్రా అంటే నొప్పులకు సంబంధించిన సమస్యలు ఉంటే వాటిని అదుపులో ఉంచుకోవాలి. నొప్పులు వల్ల కూడా బీపీ పెరిగే అవకాశం ఉన్నందున మందులు వాడుకుంటూ జాగ్రత్తగా ఉండాలి. రోజువారీ జీవన శైలిలో యోగ, మెడిటేషన్‌ను ఒక భాగంగా చేసుకోవాలి. అలాగే మోషన్ సమస్య, నిద్రలేమి సమస్య ఉన్న వారిలో కూడా అధిక రక్తపోటు వచ్చే అవకాశాలు ఉన్నందున సరిపోయేంత నిద్ర పోవాల్సి ఉంటుంది.

5. అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఓ సైలెంట్ కిల్లర్ :

డాక్టర్ కార్తీక్ కటారు. కొత్త రాజశేఖర్ రెడ్డి హాస్పిటల్స్ కన్సల్టెంట్, జనరల్ ఫిజీషియన్. హై బీపీ లక్షణాలు మొదట్లో కనిపించవు. దీంతో డయాగ్నోసిస్ చాలా లేటవుతుంది. భారత దేశంలో దాదాపు 30 శాతం నుంచి 40శాతం ప్రజలు హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నారు. అయినప్పటికీ వారందరికీ హై బ్లడ్ ప్రెషర్ ఉందన్న సంగతి తెలియదు. కొందరు మాత్రమే తెలుసుకొని ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. హై బ్లడ్ ప్రెషర్ ఓ సైలెంట్ కిల్లర్ వ్యాధి. ఎందుకంటే లక్షణాలు కనిపించకుండా సైలెంట్‌గా ఉంటుంది కాబట్టి దీనికి ఆ పేరొచ్చింది. లక్షణాలు లేకపోవడం మూలంగా చాలామంది బ్లడ్ ప్రెషర్ ఉందన్న సంగతి తెలియక డాక్టర్ చెకప్‌కు వెళ్లకపోవడం...అలాగే లేటుగా డయాగ్నోసిస్‌కు వెళ్లడం జరుగుతుంది. సంవత్సరానికి ఒకసారైనా బ్లడ్ ప్రెషర్ చెక్ చేసుకోవాలి. చెక్ చేసుకోవడం వల్ల బ్లడ్ ప్రెషర్ ఎక్కువ ఉన్నట్లయితే డయాగ్నోసిస్ చేసే అవకాశం ఉంటుంది. దీంతో సమయానికి ట్రీట్‌మెంట్ చేయడం. లైఫ్‌స్టైల్‌లో మార్పులు చేసుకోవడం..లాంగ్ టర్మ్ కాంప్లికేషన్స్ రాకుండా నియంత్రించుకోవచ్చు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సక్రమంగా లెక్కించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు పార్లమెంట్, శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఈసిఐ మార్గదర్శ కాల ప్రకారం సక్రమంగా లెక్కింపు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో గుంటూరు పార్లమెంట్, శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై విధులు కేటాయించిన సిబ్బందికి నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాటాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వ్యాలిడేషన్ కు సంబం ధించి ఎన్నికల కమిషన్ తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి వుండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కిం పు సక్రమంగా సత్వరమే లెక్కింపు కోసం సహాయక సిబ్బందిని కూడా నియమి ంచడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఈవియం ఓట్లను లెక్కింపు చేసినంత సులభతరం కాదన్నారు. పోస్టల్ బ్యాలెట్ వ్యాలిడేషన్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ వారు క్షుణ్ణంగా ప్రతి అంశంపై వివరంగా నిబంధనలు వివరి ంచడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఐటి నోడల్ అధికారి రఘు, రిటర్నింగ్ అధికా రులు సహాయక విధులు కేటాయించిన ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో సేంద్రీయ సాగు విజయవంతం

– రిటైర్డ్ వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రం

విశాలాంధ్ర-గుంటూరు : సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే సేంద్రీయ సాగు విజయవంతం అవుతుందని రిటైర్డ్ వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రం పేర్కొన్నారు. పెరుగుతున్న ప్రజల ఆహార అవసరాలను తీర్చే లక్ష్యంతో వ్యవసాయంలో రసాయనాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రసాయనాలు వచ్చిన కొత్తలో రైతులు వీటిపై మక్కువ చూపేవారు కాదని, శాస్త్రవేత్తలు బలవంతంగా కొంతమంది రైతుల పొలాలలో ప్రయోగాత్మకంగా రసాయనాలను వినియోగించి చూడగా ఆ పంటలు ఆశాజనకంగా కన్పించడం జరగడంతో రైతులు మెల్లమెల్లగా రసాయనాలకు అలవాటు పడి నేటికి విచక్షణా రహితంగా తమ వ్యవసాయంలో రసాయనాలు ఉపయోగించడం జరుగుతుందన్నారు. రాబోయే రెండు రోజులలో తేనెటీగల పెంపకం, బిస్కెట్లు, టమాట సాసు, చిరుధాన్యాలతో వంటకాలు లాంటి వాటిని ప్రత్యక్షంగా చూపించడంతో పాటు రైతుల పంటలకు విలువ జోడిరపుపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో డీపీఎం కె.రాజకుమారి, సేంద్రియ రైతు శివ నాగమల్లేశ్వర రావు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ సాధనే లక్ష్యంగా ఉద్యమిద్దాం : కేసన శంకరరావు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సమస్త జీవన రంగాలలో అణగారిన వర్గాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లకు, తమ జనాభా దామాషా మేరకు వాటా కోటాలను కేటాయించి, ఉన్నత వర్గాలతో సమాన స్థాయిలో అభివృద్ధి చెందేలా, అన్ని వర్గాల సాధికారతకు కృషి చేయడమే సామాజిక న్యాయ మంటూ, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏవో కొన్ని పదవులు కొద్దిమంది అట్టడుగు వర్గ నాయకులకిచ్చి, కొద్దిపాటి లబ్ధిని చేకూర్చే సంక్షేమ పథకాలను అమలు జరిపినంత మాత్రానే అణగారిన వర్గాలకు సామాజిక న్యాయాన్ని అందించినట్లుగా భావించరాదన్నారు. పలు ప్రాజెక్టులు, పరిశ్రమలు, పెద్ద పెద్ద భవంతులతో మహానగరాలను నిర్మించినంత మాత్రాన పేదలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరిగినట్లుగా భావించరాదన్నారు. దేశ జనా భాలో 85 శాతం గా ఉన్న బలహీనవర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ లందరికీ విద్య-వైద్యం, వర్తక- వాణిజ్య, పారిశ్రామిక రంగాలు, వ్యవసాయం, ఇతర సామాజిక వనరులన్నింటిలోనూ, సామాజిక, రాజకీయ,ఆర్థిక రంగాల న్నింటి లోనూ, తమ జనాభా దామాషా మేరకు వాటా కోటాలను కేటాయించి, సమగ్ర అభివృద్ధి జరిగినప్పుడే, సామాజిక న్యాయం అందించబడినట్లుగా, అదే నిజమైన మానవాభివృద్ధిగా మనందరం భావించాలని కేసన తెలియ జేశారు. కానీ ఈనాడు భారత్ లోని అణగారిన వర్గాల ప్రజలను ఓటు బ్యాంకుగానే రాజకీయ పార్టీలు చూస్తున్నాయి తప్ప, సామాజిక న్యాయాన్ని మాత్రం అందించడం లేదన్నారు. అందుకే మహాత్మ జ్యోతిబా పూలే, అంబేద్కర్‌ల ఆలోచనల మేరకు" సామాజిక న్యాయ సాధనే లక్ష్యంగా " బీసీలు, మిగతా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలం దరినీ కలుపుకొని, ఐక్యంగా ఉద్యమిద్దామని శంకర రావు పిలుపునిచ్చారు.

జీజీహెచ్‌లో మరో మార్పుకు శ్రీకారం

- ■ మూడు మెడికల్ స్టోర్ల ఏర్పాటుకు నిర్ణయం
- ■ దూర భారం తగ్గించేందుకే కార్యాచరణ
- ■ త్వరలో వైద్యులతో సమీక్షా సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలో ఇప్పటివరకు ఒకే మెడికల్ స్టోర్ ఉండటం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని పరిష్కరించేం దుకు నూతనంగా మార్పులు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని సూపరింటెం డెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. జీజీహెచ్‌లోని నాట్కోలో వివిధ విభాగాల వైద్యులతో శనివారం ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఒకే మెడికల్ స్టోర్ ఉండటం వల్ల సకాలంలో వార్డుల్లో మందులను తీసుకెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నారని, మెడికల్ స్టోర్ నుంచి మందులను తీసుకుని వెళ్లాలంటే స్టోర్ వద్ద గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. దీంతో రోగులకు సేవలు అందించే విషయంలో తాత్సారం జరుగుతుందని, ఈ విధానం గత 40 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విధాన ంలో మార్పులు తీసుకుని రావాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇక నుంచి ఆసుపత్రి ప్రాంగణంలోనే మూడు మెడికల్ స్టోర్లను ఏర్పాటు చేసి సకాలంలో మందులను వార్డుల్లోకి పంపిం చాలని భావిస్తున్నట్లు చెప్పారు. దీనిపై వివిధ విభాగాధిపతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని అయన పేర్కొన్నారు.

ఏబీ వెంకటేశ్వరరావు పదవీ విరమణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత నాలుగు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వేధింపులకు.. కక్ష సాధింపులకు గురై రెండుసార్లు సస్పెన్షన్‌ను ఎదుర్కొని న్యాయపోరాటంలో విజయం సాధించి తిరిగి యూనిఫారం పదవిలో పదవీ విరమణ చేసిన డీజీపీ కేడర్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అభినందించారు. జూన్ 1వ తేదీన విజయ వాడలోని ఏబీ వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లి శాలువ పుష్పమాలతో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఏబీ శేష జీవితం ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. వైకాపా ప్రభుత్వం గత ఐదు సంవత్సర కాలంలో విద్వేష రాజకీయాలను ప్రోత్సహించిందని, ప్రత్యర్థులను వెంటాడి, వేటాడే తత్వాన్ని కలిగి ఉందన్నారు. ఒకవైపు అవినీతిపరులను ప్రోత్సహిస్తూ మరోవైపు నిజాయితీ పరులను పాలనకు దూరంగా ఉంచటం వైసీపీ పాలన నైజంగా మారిందని ఆరోపించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో పని చేస్తున్న పౌర సంస్థలన్నీటిని సమన్వయపరచి రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారంలో ఏబీ వెంకటేశ్వరరావు కీలక భూమిక వహించారని లక్ష్మణరెడ్డి కోరారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

పల్నాడులో పోలీసులకు సవాల్‌గా మారిన ఎన్నికల కౌంటింగ్

- చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి తొలి ఫలితం
- చివరిగా గురజాల ఫలితం

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎన్నికల సందర్భంగా దాడులు, ప్రతిదాడులు, ఈవీఎం మిషన్ల ధ్వంసాలు, కార్లు, పార్టీ కార్యాలయాల దహనాలతో అట్టుడికిపోయి భారత్ ఎన్నికల సంఘానికి సవాలుగా నిలిచిన పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పోలీసులకు సవాలుగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 1929 పోలింగ్ కేంద్రాల్లో 14,85,909 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రికార్డు స్థాయిలో 85.65 శాతం పోలింగ్ నమోదయింది. పట్టణ పరిధిలోని జెఎన్‌టీయు కాలేజీలో జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో చిలకలూరిపేట నియోజక వర్గంకు సంబంధించి 238 పోలింగ్ కేంద్రాలలో 18 రౌండ్లు కౌటింగ్ మొదటగా ప్రారంభమవుతుంది. ఫలితం మొదటగా వెలువడుతుంది. అత్యధిక ంగా 303 పోలింగ్ కేంద్రాలు ఉన్న గురజాల నియోజకవర్గంలో 22 రౌండ్లు లెక్కింపుతో చివరిలో ఫలితం వెలువడుతుంది. నరసరావుపేట 245 పోలింగ్ కేంద్రాలు 18 రౌండ్లు, పెదకూరపాడు 266 పోలింగ్ కేంద్రాలు 19 రౌండ్లు, సత్తెనపల్లి 274 పోలింగ్ కేంద్రాలు 20 రౌండ్లు, వినుకొండ 299 పోలింగ్ కేంద్రాలు 22 రౌండ్లు, మాచర్ల 299 పోలింగ్ కేంద్రాలు 22 రౌండ్లు లెక్కింపు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపులకు 18 టేబుల్ ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు ఒక్క అసెంబ్లీ నియోజకవర్గం 14 మంది చొప్పున ఏడు నియో జకవర్గాలకు 98 టేబుల్ ఏర్పాటు చేస్తున్నారు. లోక్‌సభకు 98 టేబుల్, ఒక్కో టేబుల్‌కు ఒక పరిశీలకుడు కలిపి ముగ్గురు ఉద్యోగస్తులను నియమించారు. కౌంటింగ్ స్టేషన్‌ల వద్ద మూడంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు 700 మంది ఉద్యోగులను నియమించారు.

2 నుంచి 5 వరకు దుకాణాలు పూర్తిగా మూసివేయాలి

విశాలాంధ్ర-అమరావతి : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం 2వ తేదీ నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అమరావతి మండల పరిధిలోని ఎలాంటి దుకాణాల ద్వారా విక్రయాలు జరగకూ డదని, దుకాణాలు పూర్తిగా మూసివేయాలని అమరావతి సీఐ ఏవి బ్రహ్మం కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అల్లర్లు, అవాంఛనీయ సంఘట నలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్టివ్ అమల్లో ఉందన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గుంపు లుగా ర్యాలీగా తిరిగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతు ందని హెచ్చరిక జారీ చేశారు. పోలీసు వారి హెచ్చరికలను స్వాగతిస్తూ ప్రజలు, పోలీసు వారితో సహకరించాలని కోరారు.

కరపత్ర ఆవిష్కరణ

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : ప్రభుత్వం వారి ఉత్తర్వుల ప్రకారం 'పేరెంట్స్ అండ్ టీచర్స్ హోమ్ విజిట్' కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బోడేపూడి హనుమయ్య అండ్ సుప్రభాత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడిగడ్డ వారు ప్రచురించిన కర పత్రమును వినుకొండ ఎంఆర్సీ నందు మండల విద్యాశాఖాధికారి సయ్యద్ జఫరుల్లా ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మన పాఠశాలల్లో ఎన్రోల్‌మెంట్ పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య సత్సంబంధం నెల కొల్పు టకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వమును తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వీసీహెచ్ రామాచారి, బి.నాగేశ్వరరావు, మొహమ్మద్, యేసు మేరీ, బివి.నాయక్, బీఏ సత్తార్ పాల్గొన్నారు.

సుధాకరరావు ఉద్యోగ విరమణ

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని కర్లపూడిలోని పరిషత్ ప్రాథమిక ఎస్‌డబ్ల్యూ పాఠశాలలో ఎస్జీటీగా పని చేసిన వేము పూర్ణ సుధాకరరావు ఉద్యోగ విరమణ చేశారు. సాధారణ ఎన్నికలు జరిగి ఫలితాలు ప్రకటించినున్న సందర్భంగా శాంతి భద్రతలు కారణంగా 144వ సెక్షన్ విధించిన నేపథ్యంలో అంగూ ఆర్భాటం లేకుండా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సంధర్భంగా పలువురు ఉపాధ్యా యులు అభినందించారు. వీరి సర్వీసు సమయంలో సహ పాఠ్యాంశం కార్యక్రమాలైన వ్యాయామం, యోగా, పోలియో చుక్కలు నిర్వాహణ, పేద, పాఠశాల ఇరువైపుల మొక్కలు నాటి పాఠశాలలను నందనవనంగా తిర్చిదిద్దారన్నారు. విద్యార్థులకు స్వచ్ఛందంగా నోటు పుస్తకాలు అందజేసి పాఠశాలయోతర సమయాల్లో ప్రత్యేకంగా ఉచిత తరగతులు నిర్వహించి తల్లిదండ్రుల హృదయాలలో చోటు సంపాదించారు. పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టి పలువురు ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. పూర్ణ సుధాకరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా వేము పూర్ణ సుధాకరరావుకు వారు పని చేసిన ప్రతి ప్రాంత గ్రామస్తులు, తల్లిదండ్రుల, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా శుభాకాంక్షలు తెలిజేస్తూ వారి సేవలను గుర్తు చేసుకుని నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో శేషజీవితాన్ని అనందంగా గడపాలని ఆశీర్వదించారు.

అన్నదానం మహాదానం

- జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు

విశాలాంధ్ర-పెదకూరపాడు : అన్నదానం మహాదానమని, దయచేసి మిగిలిన అహారాన్ని వృధా చేయవద్దని జనచైతన్య సమితి కార్య దర్శి తుళ్లూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఫంక్షన్లలో మిగిలిన ఆహారం ఉందని సంప్రదిస్తే మేమే వచ్చి ఆహారాన్ని తీసుకెళ్లి పేదలకు పంచుతామన్నారు. పెదకూరపాడు మండల పరిధిలోని రామాపురం ప్రసన్నాంజనేయ స్వామి జయంతి సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మిగిలిన ఆహారం గురించి పెదకూరపాడు చెందిన ఆంజనేయ స్వామి భక్తుడు పేర్ల శివ జన చైతన్య సమితి నిర్వాహకులు కోలా టం మాస్టర్ శివకు సమాచారం ఇవ్వడంతో మంచి కార్యక్రమాలలో భాగస్వా ములవ్వాలని, మిగిలిన ఆహారాన్ని జన చైతన్య సమితి నిర్వాహకులు అక్కడికి వెళ్లి తీసుకువచ్చి మండలపరిధిలోని 75 తాళ్లూరు బేడ, బుడగ జంగాల కాలనీలో అన్నదాన వితరణ చేపట్టారు. పేదలకు చేయూతను అందించడంలో తమ సంస్థ ఎప్పుడు ముందుంటుందని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్ర మంలో సంస్థ ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నీబాబు, మెట్ల గోపి తెలుగు మహిళా నేత మహంకాళి తదితరులు ఉన్నారు. ఏదైనా ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని వృధా చేయకుండా సమాచారం ఇస్తే ఆహారాన్ని జన చైతన్య సమితి ద్వారా పేదలకు పంపిణీ చేస్తామని వివరాలకు 9885557987, 88677 7767 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సాంబశివరావు కోరారు.

ప్రకృతి సేద్యపు రైతుల గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక సీపీఐ కార్యాలయం, శివయ్య భవన్‌లో శనివారం రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవల పూడి రాము మాట్లాడుతూ మన రాష్ట్రంలో సుమారు పదివేలకు పైగా వివిధ రంగాల్లో ప్రకృతి సేద్యపు రైతులు పనిచేస్తున్నారని వీళ్లకు 16 నెలలుగా ఇచ్చే గౌరవ వేతనాన్ని వారికి ప్రభుత్వం ఇవ్వటం లేదని 16 నెలలుగా వీళ్ళు ఏమి తిని బతుకుతారని కనీసం ప్రభుత్వం ఆలోచించటం లేదని వీరిపై ఎటువంటి జాలి దయ కూడా ప్రభుత్వానికి లేదని, గ్రామాల్లో రైతులు ప్రకృతి ద్వారా వ్యవసాయం ఎలా చేయాలి తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ దిగుబడి ఎలా పొందాలి అదేవిధంగా ఎరువులు పురుగు మందులు తక్కువ వాడే నాణ్యమైన పంటను ఎలా ప్రజలకు అందించాలని లక్ష్యంతో పనిచేస్తున్న వారికి కనీస గౌరవ వేతనం ఇవ్వడంలో 16 నెలలు జాప్యం చేయడం హేయమైన చర్యగా భావిస్తూ ఇకనైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ప్రకృతి సేద్యపు రైతులకు 16 నెలల బకాయి పూర్తిగా చెల్లించాలని లేనిచో పల్నాడు జిల్లాలోని బాధితులకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా సమితి పూర్తిగా అండగా ఉండి వారికి న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన పోరాడు తుందని ఈ సందర్భ ంగా రాము ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి వెంకటేశ్వర్లు, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, రంగబాబు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాను జల్లెడ పడుతున్న పోలీసులు

- జిల్లా వ్యాప్తంగా 144తో పాటు సెక్షన్ 30 కఠినంగా అమలు చేస్తున్నాం
- జిల్లా ఎస్పీ మలికా గార్గ్

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎన్నికల కౌంటింగ్ సంద ర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా 144తో పాటు సెక్షన్ 30ని కఠినంగా అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ మాలికా గార్గ్ అన్నారు. పల్నాడు జిల్లాలో శాంతి భద్రతపై విలేక రుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా హెడ్ క్వార్టర్స్ నరసరావు పేటలో నిరంతరం ముగ్గురు ఎస్పీలు, నలుగురు అడిషినల్ ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు మకాం వేసి లా అండ్ ఆర్డర్ పర్యవేక్షిస్తు న్నారన్నారు. కౌంటింగ్ సమయ ంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఈసీ కఠిన ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, వ్యాపారులు అన్ని వర్తక వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా పూర్తిగా మూసి వేస్తున్నా రని ఎస్పీ అన్నారు. కౌంటింగ్ సజావుగా సాగటమే తన ముందున్న మొదటి లక్ష్యం అని ఎస్పి మాలిక గార్గ్ అన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి చిన్న ఘర్షణ లకు పాల్పడినా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని అల్లరి మూకలకు ఆమె హెచ్చరికలు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో శాంతి భద్రతలని ఎప్పటికప్పుడు డీజీపీ, ఈసీ పర్యవేక్షిస్తున్నారని, నరసరావుపేట జెఎన్‌టీయు వద్ద కౌంటింగ్ సమయంలో పోలీసులు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి రాష్ట్ర డీజీపీ, ఈసీ పలు సూచనలు చేశారని అన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతరం పోలీసులు నిఘా ఉంటుందని ఎస్పీ అన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో విస్తృత తనిఖీలు

- 144 సెక్షన్ అమలులో ఉంది జాగ్రత్త

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, సత్తెనపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ గురునాథ్ బాబు, సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ రాంబాబు, ముప్పాళ్ళ ఎస్సై హాజరయ్యారు. తమ సిబ్బందితో కలిసి సమస్యాత్మక గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కట్టుదిట్ట చర్యల్లో భాగంగా నేరగాళ్లపై పోలీసులు కన్నేసి ఉంచారు. ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మాక్‌డ్రిల్‌లు చేశారు. బజార్లలో ఎక్కడా పది మంది గుమికూడకుండా చూస్తున్నారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి వ్యాపార దుకాణాలన్నీ మూసేయాలని, అవసరమైతే తప్పా ఇళ్ల నుండి ఎవరూ బయటికి రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా పరిస్థితి శృతిమించి గొడవలు అల్లర్లు జరిగితే ఫైరింగ్ కూడా చేస్తామని హెచ్చరించారు. ముప్పాళ్ళ, రాజుపాలెం, నెకరికల్లు, సత్తెనపల్లి రూరల్ మండలాలలో ఓట్ల కౌంటింగ్ సమయంలో ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు ఎవరు పాల్పడకుండా ఉండేందుకు, ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ఉండేలా తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా వ్యవస్థను, కేంద్ర బలగాలను కలిగి ఉన్నామని తెలియజేశారు.

5 వరకు 144 సెక్షన్ అమలు

విశాలాంధ్ర-రెంటచింతల : మండల కేంద్రమైన రెంటచింతలలో జూన్ 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై ఎం.ఆంజనేయులు శనివారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. జూన్ 4 ఎన్నికల కౌంటిం గ్ దృష్ట్యా ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉదయం 10 గంటల కల్లా అన్ని వ్యాపార సముదా యాలన్ని మూసి వేయాలని తెలిపారు. ప్రజలు తమకు అవసరమైన నిత్యావసర వస్తువు లను ముందుగానే సమకూర్చుకోవాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహి స్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలో కొంత మందిపై బైండోవర్ కేసులు, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని, మరికొందరిపై రౌడీ షీట్లు తెరిచామని, ఎన్నికల ఫలితాల వేళ ఎవరైనా హింసకు పాల్పడినా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించినా బాణసంచా కాల్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చంద్రబాబు సీఎం కావడం ఖాయం : మల్లిఖార్జునరావు

విశాలాంధ్ర-మాచర్ల : హనుమాన్ జయంతి వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాత మాచర్లలోని ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు పాల్గొన్నారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్నారని, ఈ నెల 4న వెలువడనున్న ఫలితాల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో ప్రతి అభ్యర్థి అత్యధిక మెజార్టీలు సాధించి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు భారీ మెజారిటీతో గెలవాలని, మాచర్ల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంచి మెజారిటీ తో విజయం సాధించా లని స్వామివారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గాజుల చిన్న వీరాంజనేయులు, బాదన్ భాయ్, బొట్టు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని లేమల్లె గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమాన్ జయంతి, నవమ వార్షికోత్సవం సందర్భ ంగా స్థానిక శాసనసభ్యులు నంబూరు శంకరరావు సతీమణి వసంత కుమారి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం శనివారం నిర్వాహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఏఎన్‌యూకు రెండు రోజులు సెలవులు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంకు రెండు రోజులు సెలవులు కేటాయించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ తెలిపారు. విశ్వ విద్యాలయంలో 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఉన్న నేపథ్యంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ ఆదేశాల మేరకు సెలవులు కేటాయించినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 3, 4 (సోమ, మంగళ వారాలు) తేదీలలో సెలవులు కేటాయించినట్లు వెల్లడించారు.

"లక్ష తమలపాకులతో" హనుమాన్ జయంతి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నియోజక వర్గంలోని విఠంరాజు పల్లి గ్రామం వద్దగల సాయి బృందావనం చిన్న షిరిడి శాంతి ఆశ్రమ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శనివారం అఖండ జ్యోతి ప్రదాత నిత్య అన్నదాత పూజ శ్రీ హిమాలయ గురుదేవులు దివ్య ఆశీస్సులతో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురుదేవులు మాట్లాడుతూ ఉదయం ఆరు గంటల నుండి ఆంజనేయ స్వామి మూలవిరాట్ విగ్రహానికి అభిషేకములు పూజా కార్యక్రమం జరిపించారు. ఎనిమిది గంటలకు లక్ష తమలపాకులతో ఆంజనేయ స్వామి వారికి విశేషంగా అర్చన కార్యక్రమం సహస్రనా మార్చన కార్యక్రమం గురూజీ చేతుల మీదుగా మధ్యాహ్నం 12 గంటలకు పుష్పాభిషేకములు విశేష హారతులు జరిగాయి. అలానే ఆవరణలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమం, సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుండి మరసటి రోజు ఉదయం 6:30 వరకు 12 గంటల పాటు హనుమాన్ చాలీసా పారాయణం హనుమంత్ బీజాక్షర హోమ కార్యక్రమం జరుగును ఆదివారం ఉదయం 6:30 గంటలకు మహాపూర్ణాధి కార్యక్రమం జరుగును. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆంజనేయస్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు పెండ్యాల వెంకట మోహన్ రావు, పెండ్యాల వెంకట పుల్లారావు, కనిగంఢ్ల కోటేశ్వరరావు, కొప్పు రావూరి సుధాకర్, పి సురేష్, జోగిపర్తి స్వామి, మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మక్కెన మల్లికార్జునరావు ఆధ్వర్యంలో :

వినుకొండ : స్థానిక శ్రీ గుంటి ఆంజనేయ స్వామి వారి 44వ హనుమాన్ జయంతి మహోత్సవాలు అత్యంత వైభవపేతంగా కనుల పండుగగా భక్తులు నిర్వహించారు. వేకువజామున నాలుగు గంటల నుండి స్వామివారికి సకల లోక కళ్యాణార్థం హను మంత్ మూల వస్త్రముతో మాన్య సూక్తి విధానంగా ప్రత్యేక అభిషేకములు పుష్ప మాలా అలంకరణములు వేద పండితులచే లక్ష నాగవల్లి అర్చన నిర్వహించారు. దీక్షా స్వాములచే సామూహిక హనుమంత్ వ్రత మహోత్సవము అత్యంత వైభవ వేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు బృందం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ఏర్పాటుచేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమన్ నారాయణ, ఆనందచార్యులు, శ్రీమన్ నారాయణ, జయ చంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా నంబూరు శంకరరావు దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి వివాహ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గుంటూరు లోని ఎమ్మెల్య నివాసంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులకు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ముఖ్య నేతలు తదితరులు పాల్గొని శంకర దంప తులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ఆంజనేయు స్వామి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు బలుసుపాడు రామాపురం లగడపాడు పెదకూరపాడు హుస్సేయనగరం కాసిపాడు కంభంపాడు లింగంగుంట్ల మూసాపురం పరస వివిధ గ్రామాలలో శనివారం భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమును వేద పండితులు శ్రీపతి బాలకృష్ణ చార్యులు పరుచూరి శ్రీనివాస్ ఆచార్యులు తూములూరు శేషాచలపతి శర్మ వి సాయి శర్మ మారేపల్లి సువర్చల ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో భక్తులచే శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వైభవంగా నిర్వహించారు.

వైసీపీ అరాచక, నియంత పాలనకు సమాధి కట్టిన ప్రజలు : జీవీ

విశాలాంధ్ర- వినుకొండ : అధికార వైసీపీ అరాచక, నియంత పాలనకు రాష్ట్ర ప్రజలు శాశ్వత సమాధి కట్టేశారన్నారనీ, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వైసీపీ అయిదేళ్ల వైఫల్యాలు, ప్రజల్ని పీడించుకు తిన్న విధానాలే వారి దారుణ పరాజయానికి కారణమ న్నారు. శనివారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ మేరకు విజ్ఞతతో తీర్పు ఇచ్చిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు గాలికి వదిలేసి, అమరావతిని విధ్వంసం చేసి, ఉద్యోగాల ఊసే లేకుండా నిరుద్యోగుల ఉసురు పోసుకున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ప్రజలంతా తగిన శాస్తే చేశారన్నారాయన. పోలింగ్ రోజు రికార్డు స్థాయిలో నమోదైన ఓటింగ్, అంతకు ముందు పోటెత్తిన పోస్టల్ బ్యాలెట్లు కూడా వైకాపా ఓటమిని అప్పుడే నిశ్చయం చేశాయన్నారు. అదే సమయంలో వినుకొండ నియోజకవర్గానికి భూబకాసు రుడిలా మారిన బొల్లా బ్రహ్మనాయుడు నుంచి విముక్తి కల్పిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంద న్నారు. వినుకొండ నియోజకర్గం చరిత్రలోనే ఎన్న డూ లేని స్థాయి ఆధిక్యంతో బొల్లాపై విజయం సాధించబోతున్నట్లు ధీమా వ్యక్తం చేసిన ఆయన కనీసం 150కి పైగా స్థానాలతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారని స్పష్టం చేశారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

- తహశీల్దార్ రజని కుమారి

విశాలాంధ్ర-దుర్గి : మండలంలో గొడ వలు జరగకుండా చూడాలని రాజకీ య పార్టీల ప్రతి నిధులకు తహశీల్దార్ జి.రజని కుమారి కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో శనివారం మండల స్థాయి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన జరగబోవు కౌంటింగ్ దృష్ట్యా..మండలంలో శాంతి భద్రతలను కాపాడే దృష్ట్యా డీఎస్పీ రామకృష్ణాచారి, సీఐ సుబ్బారావు లను మండలానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించారని తెలిపారు. కౌంటింగ్ రోజు, మరుసటి రోజు గొడవలకు వెళ్ళకుండా తమతమ కార్యకర్తలను చూసుకో వాలని రాజకీయ పార్టీల ప్రతి నిధులకు సూచించారు. 101 మాచర్ల నియో జక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలు మేరకు ఈ సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జీఎల్ఎన్ గుప్తా, ఇన్‌చార్జ్ ఆర్ఐ జీరయ్య, అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలీసెట్ కౌన్సిలింగ్ వాయిదా

విశాలాంధ్ర-నరసరావుపేట : స్థానిక పల్నాడు రోడ్ గల జెఎన్‌టి యు నరసరావుపేట కళాశాలలో ఈ నెల జూన్ 3 తేదీన జరగాల్సిన ఏపి పాలీసెట్ కౌన్సెలింగ్ జూన్ 6వ తేదీకి వాయిదా పడినట్లు కాలేజి పీఆర్ఓ డాక్టర్ జీపీ రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్షన్స్ తేదీలు కుడా మారాయని కళాశాల కో-ఆర్డినేటర్, ప్రొఫెసర్ సీహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. పాలీసెట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్స్ జీరాక్స్ కాపీలు తీసుకు రావాలని అన్నారు. పాలీసెట్ రాంక్ కార్డు, పాలీసెట్ హాల్ టిక్కెట్, స్టడీ సర్టిఫికెట్ (4 నుండి 10 వతరగతి), పదవ తరగతి టీసీ, 10వ తరగతి మార్క్స్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, జనవరి నెల 2021 నుండి జారీ చేయబడిన ఆదాయ సర్టిఫికెట్, ఈడబ్లుఎస్ సర్టిఫికెట్ (2024-25),ఆధార్ కార్డులను ప్రతి విద్యార్థి తప్పనిసరిగా కౌన్సెలింగ్ తెచ్చుకోవాలని కోఆర్డినేటర్ తెలిపారు.

శ్రీ వీరాంజనేయ స్వామి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ తూర్పు బజార్ రంగనాయక స్వామి గుడి ఆవరణలో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి జన్మదిన వేడుకలు సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 108 మంది మహిళలతో హనుమాన్ చాలీసా పారా యణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నసంతర్పణ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చీటీరాల ప్రసాదు, అన్నా రామకోటయ్య, గజ్జయం సుబ్బా రావు, దేశ మల్లికార్జునరావు, మహిళల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పి సుధాకర్ వారిచే పూజలు ఘనంగా నిర్వహించారు.

1008 మామిడి ఫలాలతో విశేష అర్చన

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లిలో మహారాష్ట్ర వీధిలో శనివారం హను మజ్జయంతి సందర్భ ంగా శ్రీ భక్తాంజనేయ స్వామి వారి దేవసా నంలో స్వామివారికి 1008 మామిడి ఫలాలతో విశేష అర్చన సామూ హిక గంధ సింధుర అర్చన హనుమాన్ చాలిసా పారాయణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఛత్రపతికి శివాజీ యూత్ సభ్యులు, భక్తాంజనేయ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రానున్నది రామ రాజ్యం

- టీడీపీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్‌లో కూటమికే ప్రజలు పట్టం కట్టారని నేడు విడుదలైన ఎగ్జిట్ పోల్స్ సాక్ష్యమని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. అర్బన్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ంలో జగన్‌రెడ్డి చేసిన అరాచకాలకు..అకృత్యాలకు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పారన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని గ్రహించిన ప్రజలు కూటమివైపు మొగ్గుచూపి కూటమికి అధికారం అందించారన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి 20ఏళ్ల వెనక్కి తీసుకెళ్లాడని మండిపడ్డారు. ఓడిపోతున్నామని భయంతో ఎన్నికల ముందు..ఎన్నికల తరువాత వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు ప్రజలు మరిచిపోరని, జగన్‌రెడ్డి సంక్షేమ పథకాల పేరిట ప్రజలను నడిరోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. జూన్ 4న జరిగే ఎన్నికల ఫలితాల రోజున కూటమి ఏజెంట్లు అందరూ సమన్వయం పాటించాలని సూచించారు. అధికార పార్టీ చేసే కవ్వింపు చర్యలకు ఎవ్వరు తొందరపడవద్దని కూటమి ఏజెంట్లకు సూచించారు.

స్వామి వారి పుష్పాలంకరణ, శాంతి కళ్యాణంలో పాల్గొన్న లింగంశెట్టి

విశాలాంధ్ర-గుంటూరు : హనుమాన్ జయంతి సందర్భంగా గుంటూరు లాలాపేట మేదరబజారులో వేంచేసి యున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు మే 29వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు హనుమాన్ జయంతి మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు అభిషేకం, అనంతరం పుష్పాలంకరణ, శాంతి కళ్యాణం ముత్తేవి శ్రీనివాస శశికాంత్ పర్యవేక్షణలో జరిగింది. స్వామి వారి పుష్పాలంకరణ, శాంతి కళ్యాణ మహోత్సవానికి దేవస్థాన గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావుస్వామి పాల్గొని స్వామి వారికి పాత్రులయ్యారు. ఆదివారం మధ్యాహ్నం అన్నదానం జరగనున్నట్లు ఆయన తెలిపారు.